www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 19 మార్చి 2025

5

తూర్పుగోదావరి



అంగన్‌వాడీ సహాయకులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రాజానగరం

రాజానగరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఆరు అంగన్‌వాడీ సహాయకులు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు అని ప్రాజెక్టు అధికారిని టి.నాగమణి తెలిపారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాల వివరాలు ఆమె మంగళవారం విలేకరులకు వెల్లడించారు. దీనిలో ప్రాజెక్టు పరిధిలో రాజానగరం మండలం పాలచర్ల-2, పాతతుంగపాడు-2, రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరం-16, పిడుంగొయ్య-3, కడియం మండలం కడియం-5, వేమగిరి-4 అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల ఉద్యోగాలకు ఖాళీలు ఉన్నాయన్నారు. ఈనెల 20వ తేదీ నుంచి దరఖాస్తులు ప్రాజెక్టు కార్యాలయంలో ఇస్తారన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు ఈనెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తామన్నారు. పూర్తి వివరాలకు ప్రాజెక్టు కార్యాలయాన్ని సంప్రదించాలి కోరారు.

అమ్మో ఎండలు..!

-ప్రారంభంలోనే మండుతున్న భానుడు

-పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు

-నిర్మానుష్యంగా రహదారులు, వీధులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

వేసవి ప్రారంభంలోనే భానుడు భగభగా మండిపోతున్నాడు. రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఎండలను తట్టుకోలేక సామాన్య ప్రజానీకం అప్పుడే ఆపసోపాలు పడుతున్నారు. ఎపి విపత్తుల నిర్వహణ సంస్థ గత 10 రోజుల నుంచి వడ గాడ్పులపై తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తుంది. కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో ప్రతీ రోజు దాదాపు 10 మండలాల్లో వడగాల్పులు వీస్తున్నట్లుగా అంచనాలు వేస్తుంది. పలు ప్రాంతాల్లో ఇప్పటికే 38 నుంచి 39 గరిష్ఠ స్థాయికి ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఎండదెబ్బ తగలకుండా టోపీ, గొడుగు, టవల్, కాటన్ దుస్తులు ఉపయోగించాలని, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని, చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలని చెబుతున్నారు. గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగకూడదని, శారీరక శ్రమతో కూడిన కఠినమైన పనులను ఎండలో చేయరాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

రహదారులు నిర్మానుష్యం

మండుతున్న ఎండలకు నిత్యం కిటకిటలాడుతున్న ప్రధాన రహదారులు, వీధులు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా తుని, కాకినాడ, పిఠాపురం, పెద్దాపురం, అమలాపురం, రాజమహేంద్రవరం వంటి ప్రాంతాల్లో ప్రస్తుతం సరాసరి 36 నుంచి 38 డిగ్రీల గరిష్ఠ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 8 గంటల తర్వాత నుంచి సూర్య ప్రతాపం మొదలవుతుంది. మధ్యాహ్నం 1 గంటకే భానుడు నిప్పులు కురుస్తున్నాడు. సాయంత్రం 4 గంటల వరకూ ఎండ వేడి తగ్గడం లేదు. రాజమహేంద్రవరం, కాకినాడ నగరాలతో పాటు తుని, అమలాపురం, మండపేట, పెద్దాపురం, సామర్లకోట తదితర అన్ని పట్టణాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే నడి వేసవిలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది వేసవి తాపం బాగా పెరిగిపోవడంపై ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉక్కబోత... ఉక్కిరిబిక్కిరి

ఎండ వేడిమికి ప్రజలు ఉక్కబోతతో అల్లాడుతున్నారు. మండు వేసవిని తట్టుకోలేక చిరు వ్యాపారులు అల్లడిపోతున్నారు. కుటుంబ పోషణ కోసం తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్లపై వ్యాపారాలు సాగిస్తున్న వారంతా ఆందోళన చెందుతున్నారు. తమ ఆరోగ్యాలను పణంగా పెట్టి మరీ కష్టపడుతున్నారు. అలాగే పని ప్రదేశంలో సౌకర్యాలు లేకపోవడంతో ఉపాధి కూలీలు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం టెంట్లు సరఫరా చేయకపోవడంతో పాటు కనీసం తాగునీటి సదుపాయాలు కూడా కల్పించలేకపోతుంది. ఈ నేపథ్యంలో వెంటనే పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే వివిధ కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వ, ప్రైయివేటు సిబ్బంది సైతం ఉక్కిరిబిక్కిరి అవుతున్న పరిస్థితి నెలకొంది.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఆందోళన

ప్రస్తుతం ఎండలు ముదురుతున్నాయి. రాబోవు రోజుల్లో తీవ్రస్థాయిలో భానుడు తన ప్రతాపాన్ని చూపించనున్నాడు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. మరోవైపు 1 నుంచి 9వ తరగతి వరకు పాఠశాలలకు వెళుతున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైనది. ప్రతి సంవత్సరం వేసవిలో మార్చి 15 నుంచి ఒంటిపూట బడులు నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా సెలవులు ఇచ్చారు. పిల్లలు మధ్యాహ్నం ఇళ్లకు వచ్చేటప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆందోళన మరింత ఎక్కువైంది.

సత్యసాయి తాగునీటి సిబ్బంది సమ్మె విరమణ

సత్య సాయి తాగునీటి కార్మికులతో జిల్లా కలెక్టర్ ప్రశాంతి చర్చలు

ప్రజాశక్తి- సీతానగరం, రాజానగరం

శ్రీసత్యసాయి తాగునీటి సిబ్బంది సమస్య పరిష్కారం దిశగా కలక్టర్ ప్రశాంతి చొరవతో మంగళవారం రాత్రి నుంచి తాత్కాలికంగా సమ్మె విరమించారు. పురుషోత్తపట్నం సత్యసాయి తాగునీటి సిబ్బంది యూనియన్ ఆధ్వర్యాన ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి కార్యాలయం వద్ద రెండో రోజు సమ్మె నిర్వహించారు. సమ్మెపై జిల్లా కలెక్టర్ ప్రశాంతి స్పందించారు. ఉద్యోగులు సమస్య పట్ల ప్రభుత్వానికి ప్రత్యేక నివేదిక సమర్పించామని, తప్పనిసరిగా పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఈ విషయమై సానుకూలంగా స్పందించినట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం సత్యసాయి డ్రింకింగ్ వాటర్ వర్కర్స్ యూనియన్ పురుషోత్తపట్నం ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కలక్టర్ సమావేశం నిర్వహించారు. అనంతరం సాయంత్రం స్థానిక లాలా చెరువు జిల్లా ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద యూనియన్ ఉద్యోగ సంఘాల నాయకులు తాత్కాలికంగా సమ్మె విరమణ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ సమస్య పరిష్కారం కోసంసానుకూలత వ్యక్తం అయ్యిందని, ఒక నెల జీత భత్యాల రూ.10 లక్షలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరాకు ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని కలెక్టర్ కోరారు. స్థానిక సంస్థలతో విలీనం చేయడం వల్ల నిధుల కేటాయింపు సాధ్యం అవుతుందని తెలిపారు. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ప్రత్యేక ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రభుత్వం కార్మికుల విషయంలో సానుకూలంగా స్పందించిన నేపథ్యంలో సమ్మె విరమణ చేయవలసినదిగా కలెక్టర్ ప్రశాంతి కోరారు. శ్రీ సత్యసాయి డ్రింకింగ్ వాటర్ వర్కర్స్ యూనియన్ పురుషోత్తపట్నం ఉద్యోగులు కలెక్టర్ సూచనల మేరకు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మా సమస్య పట్ల సానుకూలంగా స్పందించి, చర్చలకి పిలిచిన నేపథ్యంలో తాత్కాలికంగా సమ్మె విరమిస్తున్నట్టు కార్మిక సంఘం అధ్యక్షుడు కట్టమూరి వీరబాబు, ప్రధాన కార్యదర్శి ఉందుర్తి ఇస్సాక్ తెలిపారు.

పింఛను ఇప్పించాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి -కడియం

అనారోగ్యంతో ఉన్న తన భర్తకు పింఛను ఇప్పించాలని మహిళ అధికారులను బాధితుడి భార్య వేడుకుంటోంది. వివరాలు ఇవి.. జేగురుపాడు గ్రామానికి చెందిన నాగిరెడ్డి సత్తిబాబుకు రెండేళ్ల క్రితం బ్రెయిన్ ట్యూమర్ వచ్చింది. అప్పటినుంచి మంచానికే పరిమితమయ్యాడు. ఇతనిది వ్యవసాయ కూలి కుటుంబానికి చెందిన వారు కావడంతో మందులతో వైద్యం చేయించడం భారంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో కనీసం బెడ్ రీడ్ పేషంట్లకు ఇచ్చే నెలకు రూ.15 వేలు పింఛను మంజూరైన కొంత వెసులు బాటు ఉంటుందని అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నారు. అయినా అధికారులు పింఛను ఇవ్వడం లేదని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. విషయం తెలిసిన రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చియ్య చౌదరి కూడా సత్తిబాబు ఇంటికి వెళ్లి స్వయంగా చూసి చలించిపోయారు. వెంటనే పింఛను వచ్చే ఏర్పాటు చేయాలని ఎంపిడిఒ రమేష్‌కు సూచించారు.సదరం సర్టిఫికెట్ ఉంటే వెంటనే పింఛను వస్తుందని చెప్పడంతో అతి కష్టం మీద కాకినాడ గవర్నమెంట్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. అక్కడ 90 శాతం వైకల్యాన్ని గుర్తించి ధ్రువపత్రం ఇచ్చినా పింఛను మాత్రం మంజూరు కాలేదు.

వ్యవసాయ క్షేత్రాల్లో 'ల్యాండ్ టు ల్యాండ్'

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం వారు గాడాల, కొంతమూరు వ్యవసాయ క్షేత్రాలలో 'ల్యాబ్ టు ల్యాండ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు సింథటిక్ రసాయనాలు, పురుగు మందుల యొక్క హానికరమైన ప్రభావాలపై రైతులకు అవగాహన కల్పించారు. సహజ వ్యవసాయ పద్ధతులను అవలంబించేలా వారిని ప్రోత్సహించారు. రసాయన విభాగాధిపతి టి.శ్రీనివాస రావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.మురళీకృష్ణ, డాక్టర్ ఎం.త్రినాథ్, డాక్టర్ వి.సత్యనారాయణ, యు.సాయికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

తూత్తుకుడి ఘటనపై కెవిపిఎస్ నిరసన

ప్రజాశక్తి-నిడదవోలు

తమిళనాడులోని తూత్తుకుడి జిల్లాలో 11వ తరగతి దళిత విద్యార్థి మూడువేళ్లను కోసేసిన సంఘటన పట్ల కెవిపిఎస్ ఆధ్వర్యాన మంగళవారం నిరసన తెలిపారు. జిల్లా ప్రధానకార్యదర్శి జువ్వల రాంబాబు ఘటనను తీవ్రంగా ఖండించారు. సామాజిక విప్లవకారుడు రామస్వామి పెరియార్ జన్మ స్థలం తమిళనాడులో ఇటువంటి సంఘటన చోటు చేసుకోవటం బాధాకరం అన్నారు. బస్సులో తండ్రి పక్కన ఉండగానే ఈ దాడి జరగడం హేయమన్నారు.

నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నాయకులు

నేడు రేషన్ షాప్ డీలర్ల సమావేశం

ప్రజాశక్తి -ఉండ్రాజవరం

జిల్లా పౌర సరఫరాల అధికారి ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని రేషన్ షాపు డీలర్లకు అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు సిఎస్ డిటి, ఎస్ఎస్.రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని 44 మంది రేషన్ డీలర్లు అందరూ తప్పని సరిగా హాజరు కావాలని ఆయన కోరారు. మండలంలో 6412 రేషన్ కార్డుదారులకు ఇకెవైసి చేయని కారణంగా ఈ సమావేశంలో ఇకెవైసి చేసే విధానం తెలియజేస్తారని తెలిపారు. ఈ మండల స్థాయి సమావేశానికి మండలానికి ఒకరు చొప్పున సహాయ పౌర సరఫరాల అధికారి, ఎజిపిఒ రాజమహేంద్రవరం జెసి నియమించిన అధికారి ఒకరు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి హాజరుకాని డీలర్ల పై జెసికి ఫిర్యాదు చేస్తామన్నారు.

యూనిఫారం అందజేత

ప్రజాశక్తి-పెరవలి

కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్ అండ్ గైడ్స్‌కు చెందిన 64 మంది విద్యార్థులకు దాతల సహకారంతో మంగళవారం యూనిఫారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సిహెచ్.రామాంజనేయులు, గ్రామ సర్పంచ్ భావన మధు, ఎస్ఎంసి చైర్మన్ నరమామిడి శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి కొమ్మిశెట్టి రామాంజని, ఎంపిటిసి కోలా లక్ష్మీ సీతయ్య నాయుడు, ఎంపిటిసి మతాల ఉషారాణి, వార్డు మెంబరు బూరుగుపల్లి రాజు, దాత అనపర్తి సత్యనారాయణ, లాయర్ వెన్నపు సుధాకర్ పాల్గొన్నారు.

ఇపిఎఫ్ పెన్షనర్స్‌కు కనీస పెన్షన్ ఇవ్వాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం, నల్లజర్ల

రాజమహేంద్రవరంలోని ఇపిఎఫ్ ఆఫీసు వద్ద ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.సోమేశ్వర రావు, సి.మోహన రావు ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బి.పవన్, సిఐటియు జిల్లా కార్యదర్శి బివిఎన్.పూర్ణిమ రాజు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి. వి.రాంబాబు, ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోరుకొండ చిరంజీవి మాట్లాడారు. నాయకులు మాట్లాడుతూ ఇపిఎఫ్-95 పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు డిఎతో కలిపి చెల్లించాలని, హయ్యర్ పెన్షన్ అందరికీ ఎటువంటి అభ్యంతరాలు లేకుండా అమలు చేయాలని, ఇపిఎఫ్ పెన్షనర్లకు వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏదో కుంటి సాకులు చెప్పి తప్పించుకుంటోందని, వెంటనే కేంద్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇపిఎఫ్ రీజినల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ప్రభాకర్, పోలిన వెంకటేశ్వర రావు, ఐ.సుబ్రహ్మణ్యం, కెవి.రావు, కె.పోశయ్య, పి.శ్రీనివాస్, అప్పారావు, బలభద్రరాజు, రాధాకృష్ణ, కె.శంకర్‌రావు, రామచంద్రరావు, ఆశపు శేఖర్ పాల్గొన్నారు.

నల్లజర్ల ఎపి స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గత పిఆర్‌సిలో తగ్గించిన అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ పూర్వ పద్ధతిలో 70 ఏళ్లకు 10 శాతం, 75 ఏళ్లకు 15 శాతంగా మార్పు చేసి ఇవ్వాలని, ఇహెచ్ఎస్ కార్డ్‌పై వైద్యం అందడం లేదని, ఆర్థిక వెసులుబాటు లేనివారు, దీనివల్ల నష్టపోతున్నారని తెలిపారు. ఇహెచ్ఎస్ కార్డుపై క్యాష్‌లెస్ వైద్యం పూర్తి స్థాయిలో అందేలా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఐవి.సత్యం, ఎస్ఎం.ఆలీ సాహెబ్. వి.కామేశ్వరరావు, కె.యేసు రత్నం, ఐడి వి.అప్పారావు. ఎవిఎస్.రావు. ప్రసాదరావు. ఖాన్ బాజీ, జి.ప్రసాదరావు, కెఎస్.ప్రకాశరావు. ఎంఎంవి.ప్రసాదరావు. ఎ.మల్లికార్జున రావు. ఎం. నరసయ్య. పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో నిరసన తెలుపుతున్న ఇపిఎఫ్ పెన్షనర్స్

చెక్కు అందజేస్తున్న ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్

మహిళా సమాఖ్య సభ్యులకు చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-కడియం

మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ నలుగురు లబ్ధిదారులకు రూ.8 లక్షల చెక్కులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగించుకుని ఆర్థికంగా అభివద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాస్, ఎపిఎం, సిసిలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గోకవరంలో జ్యోతుల రామస్వామి పర్యటన

ప్రజాశక్తి -గోకవరం

మాజీ ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు తండ్రి రామస్వామి మంగళవారం మండలంలోని తిరుమలాయపాలెం, రంపఎర్రంపాలెం, పెంటపల్లి, అచ్యుతాపురంలో పర్యటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పార్టీ పరాజయం పాలైనా పార్టీ నాయకులు, కార్యకర్తలలో ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల కోసం వినతి

ప్రజాశక్తి - సీతానగరం

రాజానగరం నియోజకవర్గంలో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ కోరారు. సిఎంను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. పురుషోత్తపట్నం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం భూసేకరణ రైతులకు నష్ట పరిహారం చాలాకాలంగా పెండింగ్‌లో ఉందని, కోరుకొండ పరిసర ప్రాంతాల్లో నరసింహస్వామి దేవస్థానం భూముల రిజిస్ట్రేషన్స్ నిలిపివేశారని, దేవస్థానం పేరుతో కోరుకొండకు చెందిన భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. ఇందువల్ల రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సత్యసాయి తాగునీటి పథకంలో పని చేస్తున్న సిబ్బంది వేతనాలు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, పథకాన్ని పటిష్ట పరిచి, అన్ని గ్రామాలకూ తాగునీరు సవ్యంగా చేరేలా నిధులు విడుదల చేయాలని కోరారు. నియోజకవర్గంలో తాగునీరు సమగ్రంగా అందించడానికి రూ.681 కోట్లతో సిపిడబ్ల్యుఎస్ పథకాన్ని మంజూరు చేయాలని, ఈ ప్రాజెక్ట్ వల్ల నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య తీరుతుందని తెలిపారు. తొర్రేడు నుండి సీతానగరం ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణానికి సవరించిన అంచనాలకు తగ్గట్టు రూ.104 కోట్ల నిధులు విడుదల చేసి, భూసేకరణ, ఇతర సమస్యలు పరిష్కరించి, రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. సీతానగరం నుంచి పురుషోత్తపట్నం పంచాయతి రాజ్ రోడ్డు ను సత్వరం పూర్తి చేయాలని విన్నవించారు. సమస్యలను సావదానంగా విన్న సిఎం చంద్రబాబు నాయకుడు సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని బలరామ కృష్ణ తెలిపారు.

సిఎం చంద్రబాబుకి విజ్ఞప్తి చేస్తున్న ఎంఎల్ఎ బలరామకృష్ణ

అరుంధతి యూత్ సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి గోపాలపురం

దొండపూడిలో అరుంధతి యూత్ ఆధ్వర్యంలో డయేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అభినందనీయమని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని ప్రధాన వీధులలో స్వచ్ఛందంగా, మండలంలోని గ్రామీణ పల్లె ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రంగా, ఉంచుకోవాలని, వీధులలో చెత్తాచెదారం వేయకుండా, శుభ్రం చేయడం, డ్రైనేజీలలో ప్లాస్టిక్ పెద్ద పదార్థాలు వేయరాదని, ప్రజలు తడి చెత్త పొడి చెత్తపై అవగాహన కలిగి ఉండాలని అరుంధతి యూత్ సూచించారు. యూత్ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని స్వచ్ఛందంగా సేవలు అందించాలని గ్రామస్తులు కోరారు.

అనారోగ్య బాధితునికి రూ.10 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గోపాలపురం

అనారోగ్యంతో బాధ పడుతున్న యువకునికి మంగళవారం జగ్జీవన్‌రామ్ అరుణోదయ సంఘం అధ్యక్షుడు చాపల రవి ఆర్థిక సహాయం అందించారు. ఆపదలో ఉన్న కడిమి రాముకు రూ.పది వేలు ఆర్థిక సహాయం అభినందనీయమని గ్రామస్తులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దీర్సిపోం మురళి, పసలపూడి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 31 మంది ఎంపిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆర్ట్స్ కళాశాల పిజి విద్యార్థులకు జరిగిన శ్రీచైతన్య స్కూల్స్ క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 31 మంది ఎంపికయ్యారనికళాశాల ప్రిన్సిపల్, జెకెసి ఛైర్మన్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలకు 106 మంది హాజరయ్యారన్నారు. ప్రాథమిక ఎంపికలో భాగంగా నిర్వహించిన రాత పరీక్ష, డెమోలో 65 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. అందులో 31 మంది కళాశాల పిజి విద్యార్థులు ఉద్యోగాలకు తుది జాబితాలో ఎంపిక అయ్యారని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపిక అయ్యిన కళాశాల విద్యార్థులకు ఉద్యోగ నియమ పత్రాలను ప్రిన్సిపల్ అందజేశారు. పిజి విద్యార్థులు, చివరి సెమిస్టర్ చదువుతుండగానే ఈ ఉద్యోగాలకు ఎంపిక అవ్వడం కళాశాలకు గర్వ కారణమన్నార. ఎంపిక అయ్యిన విద్యార్థులు ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఎంపికలో మాథెమాటిక్స్ నుంచి 10 మంది, ఫిజిక్స్ నుంచి 6 గురు, కెమిస్ట్రీ నుంచి 10 మంది, బయాలజీ నుంచి 3 , తెలుగు నుంచి 2, మొత్తం 31 మంది పిజి విద్యార్థులు ఎంపిక అయ్యారని కళాశాల జెకెసి కోఆర్డినేటర్ డాక్టర్ బి.హరినాథ్ రెడ్డి తెలిపారు. ఈ ఎంపికలకు శ్రీ చైతన్య విద్యా సంస్థల నుంచి కో ఆర్డినేటర్లుగా అరుణ్ కుమార్, కిరణ్ పాండే, వారి బృందం హాజరవ్వగా జెకెసి కోఆర్డినేటర్ డాక్టర్ బి.హరినాథ్ రెడ్డి, కళాశాల ఇంటర్న్‌షిప్ కోఆర్డినేటర్ వై.రాము, పిజి కోఆర్డినేటర్ డాక్టర్ బి.మల్లికార్జున, పిజి సబ్జెక్టుల హెచ్‌ఒడిలు, అధ్యాపకులు, ప్లేస్ మెంట్ ట్రైనర్ ఎం.కిరణ్ కుమార్, పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన కంటి వైద్య సేవలు

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని ముక్కామలలో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని పాస్ట్ డిస్టిక్ గవర్నర్ మాదిరెడ్డి బాబూజీరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరవలి మండలం లైన్స్ క్లబ్ గ్రామీణ ప్రజలకు చేస్తున్న సేవలను కొనియాడారు. వైద్యశిబిరంలో 62 మంది సేవలు పొందారని, 12 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించి, పది మందిని కంటి ఆపరేషన్లకు అర్హులుగా గుర్తించినట్టు నిర్వాహకులు తెలిపారు. దాతలు బోళ్ళ మంగారావు, సలాది ఉదయ భాస్కరరావు సాయంతో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోలా సీతయ్య నాయుడు, బి.రాజు, అరిగెల అరుణ కుమారి, ఏడిద వీర వెంకట సత్యనారాయణ, బృందావనం కృష్ణారావు, సిహెచ్.శ్రీనివాసరావు, పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లులో ఈ నెల 30వ తేదీ వరకూ గాలి కుంటు వ్యాధి టీకాలు వేస్తున్నట్టు పశు శాఖ వైద్యులు డాక్టర్ యు.ముకేశ్ తెలిపారు. మంగళవారం గ్రామంలో పశువైద్యశాల చాగల్లు ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు మరియు బ్రూసెల్లోసిస్ వ్యాధుల నివారణ టీకాలు కార్యక్రమాన్ని కొవ్వూరు డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ ఎస్.సత్యనారాయణ, సహాయ సంచాలకుడు డాక్టర్ ఎ.వెంకటరెడ్డి పరిశీలించినట్టు ఆయన తెలిపారు. గాలికుంటు వ్యాధి పశువుల్లో వైరస్ ద్వారా వ్యాప్తి చెంది వ్యాధి సోకిన పశువులు బలహీన పడడం, జ్వరంతో నోరు, నాలుక వద్ద బొబ్బలు ఏర్పడి మేత మేయకపోవడం, చొంగ కార్చడం, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ కార్ర్యక్రమంలో జుజ్జువరపు. రామచంద్రరావు, పశు సంవర్ధక సహాయకులు నాగేంద్రబాబు, లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు

చోరీ సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక మెయిన్ రోడ్‌లో గత నెల 9వ తేదీన జరిగిన జ్యువెలర్స్ షాప్ చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఈ కేసు వివరాలను ఎస్‌పి జి.బిందుమాధవ్ వెల్లడించారు. మెయిన్ రోడ్‌లో గల సిద్ధనాథ్ జ్యువెలర్స్‌లో సినీ పక్కిలో షాపు వెనుక భాగం రంధ్రం చేసి వెండి, బంగారు వస్తువులు చోరీకి గురయ్యాయి. ఈ నేపథ్యంలో నిందితులు అన్నమయ్య జిల్లాకు చెందిన కరణం కుమార్, కడప జిల్లాకు చెందిన కుమ్మల వెంకటసుబ్బయ్యలను పోలీసులు సాంకేతికత వినియోగించి అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి 32.9 గ్రాముల బంగారం, 11.5 కిలోల వెండి, పల్సర్ మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కేసు చేదించడంలో ముఖ్య పాత్ర పోషించిన డిఎస్‌పి శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సిఐ బి.సూర్యఅప్పారావు, ఎస్‌ఐ రామలింగేశ్వరరావులను ఎస్‌పి అభినందించారు.

ప్రమాదంలో యువకునికి గాయాలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

బైకుపై వెళుతూ ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు నగర పంచాయతీ పల్లిపాలెం నక్కా వారి పేటకు చెందిన పెయ్యల అరుణ్‌కుమార్ సోమవారం రాత్రి అమలాపురం నుంచి ముమ్మిడివరం వైపు వస్తూ జాతీయ రహదారి 216 పై వే బ్రిడ్జి సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అరుణ్ కుమార్ ను అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గోకవరం

ఇటికాయలపల్లి గ్రామ శివారులో కోడిపందేలపై గోకవరం ఎస్‌ఐ వివిఎన్ వి.పవన్ కుమార్ ఆధ్వర్యంలో దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.7,200 నగదు, రెండు పందెం కోళ్ళు, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

పురుగులు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాలు ప్రకారం మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన అవిడి గణపతి (45) ఇటీవల కాలంలో మద్యానికి బానిసై తరచూ ఇంటికి తాగి వచ్చేవాడు. పది రోజుల క్రితం ఫిట్స్ వచ్చి అనారోగ్యానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో మన స్థాపన గురైన గణపతి ఈనెల 16న ఇంటి వెనక వైపు ఉన్న తోటలోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. దీంతో వెంటనే అతనిని కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా సోమవారం రాత్రి పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎస్.రాము మంగళవారం తెలిపారు.

తండ్రి ఆచూకీ కోసం గాలింపు

ప్రజాశక్తి - రామచంద్రపురం

నెలపర్తిపాడు పంట కాలవలో చిన్నారులను తోసివేసిన సంఘటనలో తండ్రి కోసం పోలీసులు మంగళవారం విస్తతంగా గాలింపులు చేపట్టారు. పిల్లలను కాలువలకు తోసివేసిన వెంటనే తండ్రి రాజు తన స్కూటీతో పరారైనట్లు పోలీసులు భావిస్తున్నారు. రాజు ఆత్మహత్యకు పాల్పడ్డాడా? లేదా పరారయ్యాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ మేరకు రామచంద్రపురం, కె.గంగవరం మండలాలతో పాటు యానాం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సంఘటనలో మృతి చెందిన చిన్నారి కారుణ్యకు మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

గృహహింస, వేధింపులపై కేసు

ప్రజాశక్తి - సీతానగరం

అదనపు కట్నం కోసం గృహహింస, వేధింపులకు గురి చేయడంపై బాధితురాలు సత్తి మణిమాల మంగళవారం సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూనవరం గ్రామానికి చెందిన మణిమాలకు కాకినాడ జిల్లా గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన సత్తి సోమశేఖర్‌తో 12 ఏళ్ల క్రితం వివాహం అయ్యింది. కొంతకాలం కాపురం సజావుగానే సాగింది. భర్త సోమశేఖర్‌తో పాటు అత్త అనంతలక్ష్మి, మావయ్య కృష్ణమూర్తి అదనపు కట్నం తీసుకురావాలంటూ వేధింపులకు పాల్పడ్డారు. దీంతో ఆమె స్వగ్రామం కూనవరంలో తల్లిదండ్రుల వద్ద ఆశ్రయం పొందుతోంది. భర్తతో కాపురం చేయాలని భావించి సర్దుబాటు చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. కాపురం చేయాలంటే అదనపు కట్నం తీసుకురావాలని అత్తమామల ప్రోద్భలంతో భర్త సోమశేఖర్ వేధింపులు పాల్పడుతున్నట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి.రామ్ కుమార్ తెలిపారు.

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - నల్లజర్ల

పోతవరంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు దేవరపల్లి ప్రోహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృత్యువాత

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని మలకపల్లి, పెద్దేవం గ్రామాల మధ్య గల రావూరుపాడు బస్ స్టాప్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు. కొన్ని రోజులుగా బస్ షెల్టర్‌లో ఉంటూ చుట్టుపక్కల వారు పెట్టింది తింటున్నట్లు తెలిపారు. సుమారు 40 నుంచి45 ఏళ్ల మధ్య వయసు గల ఈ వ్యక్తి మంగళవారం మృతి చెందాడని తెలిపారు.

చెట్టును బైకు ఢీకొని వ్యక్తి మరణం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం వెళ్లే మెయిన్ రోడ్డులో మోటార్‌సైకిల్‌పై వస్తూ సోమవారం రాత్రి చెట్టును ఢీ కొట్టిన యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు వెంటూరు గ్రామానికి చెందిన యర్రగంటి శ్రీ దత్తు(35)గా పోలీసులు గుర్తించారు. ద్రాక్షారామ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యానాం వార్తలు

ఎల్‌ఎడి డైరెక్టర్‌తో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ అశోక్

ఎల్‌ఎడి డైరెక్టర్‌తో ఎంఎల్‌ఎ అశోక్ భేటీ

ప్రజాశక్తి- యానాం

పుదుచ్చేరి ఎల్‌ఎడి డైరెక్టర్ ఎస్.శక్తివేల్‌తో ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలను చర్చించినట్లు ఎంఎల్‌ఎ స్థానిక విలేకరులకు వెల్లడించారు. కనకాల పేట, యుకెవి నగర్, భీమ్ నగర్ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రధాన డంపింగ్ యార్డ్ సమస్యను డైరెక్టర్‌కు వివరించినట్లు తెలిపారు. పుదుచ్చేరి అధికారులు డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి నెల రోజులు గడువు కావాలని కోరినట్లు తెలిపారు. అప్పటివరకు ప్రస్తుతం ఉన్న డంపింగ్ యార్డ్‌లో చెత్త వేయడాన్ని అనుమతించాలని ఆయా గ్రామాల ప్రజలను కోరారు. శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. లేనిపక్షంలో డంపింగ్ యార్డ్‌లో చెత్త వేయకుండా అడ్డుకుని, ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

21న యానాం బంద్‌కు పిలుపు

ప్రజాశక్తి - యానాం

డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21వ తేదీన యానాం బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఎఐఎడిఎంకె పార్టీ సెక్రటరీ మంచాల సత్యసాయికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొద్ది రోజులుగా యానాంలో కొనసాగుతున్న చెత్త తరలింపు, డంపింగ్ యార్డ్ సమస్యపై ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్య వైఖరి కారణంగా నియోజకవర్గంలో రహదారులు, నివాస, వ్యాపార సముదాయాల చుట్టూ చెత్త పేరుకుపోయి పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి పెనుముప్పుగా మారిందన్నారు. వచ్చే గురువారం లోపు సమస్య పరిష్కరించకుంటే ఎఐఎడిఎంకె పార్టీ ఆధ్వర్యంలో 21వ తేదీన బంద్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ బంద్‌ను వర్తక వ్యాపారస్తులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలు జయప్రదం చేయాలని కోరారు.

ఆలయ పనులను పరిశీలించిన మల్లాడి

ప్రజాశక్తి - యానాం

వెంకటేశ్వర స్వామి (మీసాల వెంకన్న) ఆలయ పున్ణ నిర్మాణ పనులను మంగళవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా చేపట్టాలని సూచించారు.

ఏప్రిల్ 8 నుంచి టైగర్ ట్రయంఫ్-25 సైనిక విన్యాసాలు

ప్రజాశక్తి - కాకినాడ

ఏర్పాట్లుపై సమీక్షిస్తున్న డిఆర్‌ఒ వెంకట రావు

కాకినాడ తీరంలోని నేవల్ ఎన్ క్లేవ్‌లో ఈ ఏడాది ఏప్రిల్ 8 నుంచి 13వ తేదీ వరకూ భారత్, అమెరికా వాయుసేనా దళాలు ఉమ్మడిగా టైగర్ ట్రియంఫ్-25 సైనిక విన్యాసాల జరుగుతున్నాయని డిఆర్ఒ జె.వెంకటరావు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో జరిగిన సమావేశానికి డిఆర్ఒ అధ్యక్షత వహించారు. తొలుత సివిల్-మిలటరీ లైజాన్ అధికారి కమాండర్ వైకె.కిషోర్ మాట్లాడుతూ భారత్, అమెరికా వాయుసేనల సంయుక్త ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 నుంచి 13వ తేదీ వరకూ టైగర్ ట్రియంఫ్-25 పేరిట ఉమ్మడి సైనిక విన్యాసాలను విశాఖపట్నం, కాకినాడ తీరాలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా ఏప్రియల్ 8 నుంచి 13వ తేదీ వరకూ కాకినాడ తీరంలోని నేవల్ ఎన్‌క్లేవ్‌లో సముద్రంలోను, ఉపరితలంపైన విన్యాశాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాలను సజావుగా నిర్వహించేందుకు వివిధ ప్రభుత్వ శాఖలు సహకరించాలని కోరారు. ఏప్రిల్ 7వ తేదీ నాటికి విన్యాసాలు జరిగే కాంపింగ్ సైట్‌లో చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేయించాలని, అలాగే విన్యాసాలు జరిగే వారం రోజులు పారిశుద్య నిర్వహణకు అవసరమైన సిబ్బంది, యంత్రాలను ఏర్పాటు చేయాలని డిఆర్ఒ ఆదేశించారు. సముద్రంలో విన్యాసాలు జరిగే ప్రాంతానికి సమీపంలోకి మత్స్యకారుల బోట్లు ప్రవేశించకుండా మత్స్య శాఖ, మెరైన్ పోలీస్ శాఖలు కట్టుదిట్టం చేయాలన్నారు. ఈ సమావేశంలో సైనిక అధికారి టివివి.ప్రసాద్, మైరైన్ పోలీస్ అధికారి రామ్మోహన్‌రెడ్డి, రూరల్ సిఐ చైతన్యకృష్ణ, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీ, మత్స్యశాఖ అధికారి అనూరాధ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నోటీసులు వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి - పిఠాపురం

ఏజెన్సీ కోర్టులో ప్రాక్టీస్ చేయాలనుకునే న్యాయవాదులు సబ్ కలెక్టర్ నుంచి అనుమతి తీసుకోవాలని జారీ చేసిన నోటీసులను వెనక్కు తీసుకోవాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మేడపాటి ధర్మారెడ్డి, గుడిమెళ్ళ శ్రీభాస్కరాచార్యులు మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. సబ్ కలెక్టర్ నోటిసులు న్యాయవాదులను ఆందోళనకు గురి చేస్తున్నాయని అన్నారు. తక్షణం నోటీసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నోటీసుల వ్యవహారంపై రాష్ట్ర బార్ కౌన్సిల్‌కి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ట్రస్ట్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - పెదపూడి

గ్రామాభివృద్ధికి సామాజిక సేవలు విస్తరిస్తున్న సేవాకీయం ట్రస్ట్ సేవలు అభినందనీయమని కరకుదురు సర్పంచ్ వుండ్రు చంద్రకళ అన్నారు. మంగళవారం ట్రస్ట్ అధ్వర్యంలో పంచాయతీకి సుమారు రూ.25వేలు విలువగల వాటర్‌ప్యూర్ ఫైడ్ ఫిల్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో నిత్యం సేవ కార్యక్రమాలు చేస్తూ అందరికి అందుబాటులో ఉంటున్న సేవాకీయం ట్రస్ట్ సేవలు అభినందనీయమని అన్నారు. ట్రస్ట్ వైస్ ఛైర్మన్ పాటంశెట్టి త్రిమూర్తులు మాట్లాడుతూ గత ఐదేళ్ళగా గ్రామంతోపాటు పరిసర గ్రామాల్లో పాఠశాలలు, ఆలయాలు అభివృద్ధి, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి భోగరాజ ప్రసన్న ఆంజనేయులు, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, ట్రస్ట్ ప్రతినిధులు పాటంశెట్టి వెంకటేష్, సక్కా సిద్ధు, అడపా శ్రీనివాసు, అడబాల సత్తిబాబు, ఆకుల బాలాజీ పాల్గొన్నారు.

జెఎన్‌టియుకె ఆధ్వర్యాన స్వచ్ఛ భారత్

ప్రజాశక్తి - కాకినాడ

జెఎన్‌టియుకె ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్‌టిసి బస్ స్టేషన్‌లో పరిశుభ్రతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ అధ్యక్షతన చేపట్టిన ఈ కార్యక్రమాన్ని తొలుత యూనివర్శిటీ మెయిన్ గేట్ వద్ద ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ ప్రొ.వి.రవీంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

ఆధునిక వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

వ్యవసాయ పొలాల క్షేత్ర పరిశీలన, రైతులకు శిక్షణ కార్యక్రమాల ద్వారా ఆధునిక వ్యవసాయ విధానాలపై అవగాహన పెంచాలని మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విద్యాలయం, పెద్దాపురం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమన్వయ సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ పంటకు పెట్టుబడిని తగ్గించడంతో రైతుకు ఆదాయం పెరుగుతుందని, ఆ దిశగా అధికారులు, శాస్త్రవేత్తలు రైతుల్లో అవగాహన పెంచాలన్నారు. ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎ.సీతారామ శర్మ 2024-25 సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారుల ప్రతినిధి శ్రీహరి, ఎటిఎం ఐపి ప్రాజెక్టు అధికారి వరప్రసాద్ మాట్లాడారు. ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

నేత్రాల దానం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పోలేకుర్రు పంచాయతీ తోటపేట గ్రామానికి చెందిన దున్నా చిన్నవెంకటరెడ్డి (59) మంగళవారం తెల్లవారుజామున ఆకస్మికంగా మరణించారు. కుటుంబ సభ్యులకు సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ నేత్రదానంపై అవగాహన కల్పించి వెంకటరెడ్డి కార్నియాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు అందజేశారు. కుటుంబ సభ్యులను పలువురు పరామర్శించారు.

ఘనంగా గరగల సంబరాలు

ప్రజాశక్తి - కిర్లంపూడి

కిర్లంపూడిలోని నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో ఘనంగా గరగల సంబరాలు నిర్వహించారు. కిర్లంపూడి, రమణయ్యపేటకు చెందిన అనిల్ పార్కింగ్ టైల్స్ అధినేత సేనాపతి కన్నబాబు, విజయ దంపతులు, కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన గరగల సంబరాలు నిర్వహించారు. గరగల నృత్యాలు ఆద్యాంతము చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రసాద వితరణ చేశారు.

బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ ఎఇ

ప్రజాశక్తి - సామర్లకోట

మున్సిపల్ ఎఇగా నరసింహరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. పిఠాపురం మున్సిపాలిటీ నుంచి ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్యను మర్యాదపూర్వకంగా కలిశారు.

రెవెన్యూ విధి విధానాలపై సమీక్ష

ప్రజాశక్తి - పెద్దాపురం

రెవెన్యూ కార్యక్రమాల విధి విధానాలపై అసిస్టెంట్ కలెక్టర్ భావన సమీక్షించారు. మంగళవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్‌డిఒ కె.శ్రీరమణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రభుత్వ పథకాల అమలు, పిజిఆర్‌ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులు, రీ సర్వే పురోగతి, రెవెన్యూ సదస్సులు, మరో విడత రీ సర్వే నిర్వహణపై గ్రామాల ఎంపిక, గ్రామసభల నిర్వహణ, ఇళ్ల స్థలాల పరిశీలన, కౌలు రైతుల గుర్తింపు కార్డులు తదితర అంశాలపై సమీక్షించారు. పలు మండలాలకు చెందిన తహాశీల్దార్లు పాల్గొన్నారు.

మురుగు కాలువలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ నుంచి అన్నయ్య పేట మీదుగా వెళ్లే మురుగు కాలువలో మృత దేహాన్ని పోలీసులు గుర్తించారు.. మృతుడు శుక్రవారపుపేటకు చెందిన గట్టి సతీష్ (42)గా పోలీసులు గుర్తించారు. క్రేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఆసుపత్రికి తరలించారు.

నిధుల మంజూరు పత్రాలు అందజేత

ప్రజాశక్తి - జగ్గంపేట

ఎస్‌సి, ఎస్‌టి, బిసి లబ్ధిదారుల గృహాలకు అదనపు ఆర్థిక సాయంకు సంబంధించి మంజూరు పత్రాలను లబ్దిదారులకు అందజేశారు. మంగళవారం మండలంలోని రామవరం గ్రామంలో నిర్మాణం లో ఉన్న గృహాలను జిల్లా హౌసింగ్ పీడీ ఎన్‌వివి.సత్యనారాయణ పరిశీలించారు. అదనంగా నిధులు మంజూరు అయిన పత్రాలను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సాయంపై ప్రభుత్వం జిఒ జారీ చేసిందన్నారు. ఎస్‌సి, బిసి లబ్దిదారులకు రు.50 వేలు, ఎస్‌టి లబ్దిదారులకు రు.75 వేలు, ఎస్‌టిలో అట్టడుగున జీవిస్తున్న వారికి రూ.ఒక లక్ష సాయం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంతో గృహాలను త్వరితగతిని పూర్తి సుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఇ వేణుగోపాలస్వామి, ఎఇ శేఖర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

రాజగోపురం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - పెదపూడి

మండలంలో గొల్లల మామిడాడ సూర్యనారాయణపురంలో వెంకటేశ్వర స్వామి రాజగోపురం నిర్మాణం నిమిత్తం ఆలయ వ్యవస్థాపకులు నల్లమిల్లి సూర్యనారాయణ రెడ్డి అల్లుడు రాజానగరంకు చెందిన సత్తి శ్రీనివాసరెడ్డి, మోహిని వరలక్ష్మి దంపతులు రూ. 5 లక్షలు, కొప్పవరంకు చెందిన కర్రి వెంకట్ రెడ్డి, సురేఖ దంపతులు రూ. 1 లక్ష, గొల్లల మామిడాడకు చెందిన పులగం సత్యనారాయణ రెడ్డి, పార్వతి దంపతులు రూ 1 లక్ష రూపాయలు విరాళాన్ని అందజేశారు.

CHANGE OF NAME

I, MUDUNURI SIVARAMARJU, (New Name), S/o PAKIR RAJU, Male, Age 38 Years, R/o D.No.3-90, Pendyala Village, Nidadavole Mandal, E.G.Dist., A.P., Do hereby inform to the public that my name MOODUNURI SIVARAMARAJU (Old Name) has been changed to MUDUNURI SIVARAMARAJU (New Name) for all transactions.

నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం పటిష్టంగా అమలు చేయాలని 3వ సెషన్స్ ఆడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ పి.కమలాదేవి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ మందిరంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ జె.నరసింహనాయక్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన 158 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు సక్రమంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ నెల నుంచి ఫిబ్రవరి నెల వరకు 40 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా 347 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా కొత్తగా నమోదు చేసుకున్న 2 స్కాన్ సెంటర్లకు, 4 రెన్యూవల్, 14 స్కాన్ సెంటర్ల మిషన్ మార్పు, డాక్టర్ మార్పు వాటికి కమిటి ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా జడ్జ్ పి కమలాదేవి బేర్ యాక్ట్ పుస్తకాలను ఆవిష్కరించారు. అందరూ రేడియాలజీస్ట్, గైనకలాజిస్ట్ స్కాన్ సెంటర్ ఓనర్లు తప్పనిసరిగా పిసిపిఎన్‌డిటి. చట్టం యొక్క నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. స్కాన్ సెంటర్ నందు రిజిస్టర్లు, ఫారం ఎఫ్, కన్సెంట్ ఫారం వంటివి తప్పనిసరిగా మెయిన్ టైన్ చేయాలని ఆదేశించారు. డిఆర్ఒ జె.వెంకట రావు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేటు స్కాన్ సెంటర్లు చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ కెవి.సుబ్బరాజు, డాక్టర్ పి.సరిత, ఎంజెవి.భాస్కరరావు, డిసిహెచ్ఎస్. డాక్టర్ ఎస్.స్వప్న, స్వచ్ఛంద సంస్థ ప్రతినిదులు పాల్గొన్నారు.

ఒక్కో బూత్‌లో 1,200 మంది ఓటర్లు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

నియోజకవర్గంలోని ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 1,200 మంది ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు తెలిపారు. మంగళవారం రూరల్ రెవెన్యూ కార్యాలయంలో నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1,200 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నచోట ప్రత్యామ్నాయ పోలింగ్ కేంద్రాన్ని 2 కిలోమీటర్ల పరిధి లోపల కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. పోలింగ్ కేంద్రాలు మార్పు చేయవలసి ఉంటే అట్టి పోలింగ్ స్టేషన్ వివరాలను అందించాలని కోరారు. ఈ సమావేశంలో తహాశీల్దార్ ఎస్‌ఎల్‌ఎన్.కుమారి, డిటి కళ్యాణ్‌చక్రవర్తి, ఆర్ఐ ఎంవిడి.భవాని, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

20న ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక భాస్కర్ నగర్‌లోని ఇమ్మానుయేల్ చర్చిలో ఈ నెల 20న ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు బ్లెస్సింగ్ ఫౌండేషన్ ఫౌండర్ ఛైర్మన్ డాక్టర్ టి బ్లెస్సింగ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పిఠాపురం సిఎంసి సౌజన్యంతో 20వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే శిబిరంలో నేత్ర వైద్యులు డాక్టర్ అమృతలాల్ బృందం కంటి పరీక్షలు నిర్వహిస్తుందన్నారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందిస్తారన్నారు. ఇంకా నీటికాసులు, శుక్లము, మెల్లకన్ను, కనురెప్ప వాలుట, కార్నియల్ ఒపాసిటీ సమస్యలున్న వారికి కోత, కుట్టు లేని అధునాతన పద్దతిలో ఉచితంగా ఆపరేషన్‌లు చేయనున్నట్లు తెలిపారు. శిబిరానికి హాజరయ్యే ప్రజలు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నెంబర్‌ను తీసుకురావాలన్నారు. ఈ అవకాశన్ని సామర్లకోట పరిసర ప్రాంతాల ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

గ్రామపంచాయతీ కార్యాలయం, మోర్త
ఉండ్రాజవరం మండలం, తూర్పుగోదావరి జిల్లా

ఆర్.ఒ.సి. నెం.09/2025 — **టెండరు ప్రకటన** — తేది.13-03-2025

తూర్పుగోదావరి జిల్లా, ఉండ్రాజవరం మండలం, మోర్త గ్రామపంచాయతీ నందు ది, 01-04-2025 నుండి ది. 31-03-2026వ తేదీ వరకు అనగా 1 సంవత్సర కాలము వరకు పనిచేయుటకు టెండర్లు స్వీకరించబడును. ది. 18-03-2025వ తేదీ ఉదయం 11.00 గం॥ల నుండి టెండర్లు స్వీకరించబడి అదేరోజు సాయంత్రం గం॥ 4.00 లోపు తెరువబడును. కావున ఈక్రింది పోస్టులకు టెండర్లు దాఖలు పరచుకోవలసిందిగా కోరడమైనది. షరతులు మరియు నియమ నిబంధనలు మోర్త గ్రామపంచాయతీ కార్యాలయము నందు కార్యాలయపు పనివేళల యందు తెలుసుకొనవలెను.

వ.నెం.	పని పేరు	వ్యక్తుల సంఖ్య	పని కాలము	ధరావత్తు
1	పారిశుద్ధ్య నిర్వహణ పోస్టులు	8	2025-2026	50
2	ఆఫీసు అటెండరు	1	2025-2026	50
3	పంపు ఆపరేటరు	2	2025-2026	50
4	ఎలక్ట్రీషియన్	1	2025-2026	50
5	పి.హెచ్. సామానులు	--	2025-2026	100
6	వాటరు వర్క్సు సామానులు	--	2025-2026	100
7	ఎలక్ట్రికల్ గూడ్సు	--	2025-2026	100
8	స్టేషనరీ	--	2025-2026	100

సం/- **పంచాయతి కార్యదర్శి**
గ్రామపంచాయతీ, మోర్త, ఉండ్రాజవరం మండలం, తూర్పుగోదావరి జిల్లా

గ్రామపంచాయతీ కార్యాలయం, యర్రవరం
ఏలేశ్వరం మండలం, కాకినాడ జిల్లా

ఆర్.ఓ.సి. నెం. 19/2023 — తేది: 10-03-2025

టెండరు ప్రకటన

ఏలేశ్వరం మండలం, యర్రవరం గ్రామపంచాయతీ పి.ఆర్. నెం. 31, తేదీ. 08-12-2025 అనుసరించి పారిశుద్ధ్యము, త్రాగునీరు సేవలకు గాను ఈ క్రింది షరతులకు లోబడి కాంట్రాక్టు పద్ధతిన చేయుటకు సీల్డు టెండర్లు కోరడమైనది. లోకల్ టెండరు పరిశీలించి తక్కువ కోట్ చేసిన టెండరుదార్లుకు ది. 26-3-2025వ తేదీ సాయంత్రం 5.00 గం॥లకు గౌరవ సర్పంచ్ హాజరైన టెండరుదారుని సమక్షములో టెండరు తెరువబడును. పూర్తి వివరములు ఆఫీసు పనిచేయు వేళల్లో తెలుసుకొనవచ్చును.

శానిటరీ మేస్త్రీ - 1, స్వీపర్లు - 5, బోరువెల్ ఆపరేటర్లు : 3, మిని ట్రాక్టర్ డ్రైవర్ - 1

షరతులు:
1. సప్లయి చేయబడిన వ్యక్తులకు తాత్కాలిక ప్రాతిపదికన కాంట్రాక్టు 3 సంవత్సరాలు వరకు మాత్రమే అమల్లో ఉండును. 2. సప్లయి చేయబడిన వ్యక్తులకు దుస్తులు, సబ్బులు, వగైరాలు టెండరుదారుడే సప్లయి చేసుకొనవలెను. 3. సప్లయి చేయబడిన వ్యక్తులకు వేతనములు వారు పనిచేసిన రోజులకు మాత్రమే గ్రామపంచాయతీ చెక్కు ద్వారా చెల్లించబడును. 4. టెండరుదారుడు సదరు షరతులు పాటిస్తానని అగ్రిమెంటు వ్రాసి ఇవ్వవలెను.

శ్రీ భీశెట్టి అప్పలరాజు
సర్పంచ్, గ్రామపంచాయతి, యర్రవరం

యం.వి.ఆర్.ఆర్.వర్మ, I/c.
గ్రామ పంచాయతీ కార్యదర్శి, యర్రవరం

అన్న హజారేకి వివరిస్తున్న ధర్మారావు

అన్న హజారేని కలిసిన ధర్మారావు

ప్రజాశక్తి - తాళ్లరేవు

సామాజిక ఉద్యమ కారుడు అన్నా హజారేనతు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సంగాడి ధర్మారావు ఈ నెల 15న పూణేలో కలిశారు. ఈ సందర్భంగా తీర ప్రాంతంలో నెలకొల్పిన పరిశ్రమలు, చమురు సంస్థల నుంచి వెలువడే రసాయనిక వ్యర్థాలు వల్ల సముద్ర జలాలు కలుషితమవుతున్నాయని ఆయనకు వివరించి నట్లు మంగళవారం స్థానిక విలేకరులకు తెలిపారు. తీరప్రాంతాల పర్యావరణ వ్యవస్థ భారీ సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని అన్నారు. పర్యావరణ విధ్వంసాన్ని అరికట్టడానికి జాతీయ స్థాయిలో చేపట్టే పోరాటానికి అన్నాహజారే మద్దతును కోరినట్లు తెలిపారు. ఈ అంశంపై పర్యావరణ వేత్త మేధాపాట్కర్‌ను త్వరలోనే కలిసి మద్దతు కోరతానని తెలిపారు.

BEFORE THE EAST GODAVARI DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION : AT KAKINADA.
CC.No. 86 of 2024

Between:
Pothula Hari Prakash ...Complainant
and
1) Reliance Retail Limited,
Rept., by Authorized Signatory, Kakinada.
2) Reliance Retail Limited,
Rept., by Authorized Signatory, Kakinada.
...Opposite Parties

To:
Notice to 1st Opposite Party/1st Respondent:
1) Reliance Retail Limited, Rep.,by Authorized Signatory, C-51, Plot No.9, IDA Park, APIIC, Road No. 8 , Vakalapudi, Thammavaram Village, Kakinada, Kakinada District, A.P.,

పై నెంబరు పిటీషను/ కంప్లయింటులో 1వ రెస్పాండెంట్ అయిన మీపై తూర్పు గోదావరి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, కాకినాడ యందు సి.సి.నెం. 86 ఆఫ్ 2024 గా పిటిషనర్/కంప్లయింటు గారు వేసియున్నారు. సి.సి.లో మీకు తూర్పు గోదావరి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, కాకినాడ వారు మీకు నోటీసులు పంపియున్నారు. అయినను 1వ రెస్పాండెంట్ / అపోజిట్ పార్టీ వారు ఎన్ని సార్లు నోటీసులు పంపించినను పుచ్చు కొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున సదరు 1వ రెస్పాండెంట్ /అపోజిట్ పార్టీ అయిన మీరు **ది. 04-04-2025వ తేదీన ఉదయం గం. 10.30 ని॥లకు** పైన ఉదహరించిన శ్రీ తూర్పు గోదావరి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, కాకినాడ వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గానీ హాజరు అయ్యి మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న శ్రీ తూర్పు గోదావరి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, కాకినాడ వారికి తెలియపరుచు కొనవలెను, లేని యెడల శ్రీ తూర్పు గోదావరి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, కాకినాడ వారు మీ పరోక్షమునందు విచారించి తీర్మానము చేయుదురు అని యిందుమూలముగా తెలియజేయడమైనది.

పలివెల వెంకటేశ్వరరావు, అడ్వకేట్
#1-12-5, మిలటరీ రోడ్, భానుగుడి జంక్షన్ దగ్గర, కాకినాడ. సెల్: 98488 48152

విల్ డీడ్ దస్తావేజులు పడిపోయినది

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రావులపాలెం మండలం, రావులపాలెం గ్రామానికి చెందిన కమ్మ వీర వెంకట రావు గారి కుమారుడు బి.వి.వి.సత్యప్రసాద్ అను నేను ది. 20-02-2025 న నా పేరున గల 01/బికె-3/2013 నంబరు గల ఒరిజినల్ విల్ డీడ్ దస్తావేజును అంగర చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు నందు క్రాఫ్ లోన్ రెన్యూవల్ నిమిత్తం అంగర సెంటరులో జిరాక్సు తీయించి బ్యాంకుకు వెళ్లుచున్న సమయంలో మార్గ మధ్యలో ఎక్కడో పడిపోయినది. దొరికినవారు దయచేసి ఈ క్రింది అడ్రసుకు తెలియపరచగలరు.

కమ్మ బి వి వి సత్య ప్రసాద్
రావులపాలెం, ఫోన్ : 98660 28159

పాస్‌పోర్టు పడిపోయినది

ఏసేబు అర్జుల, S/o. మోషే, డోర్ నెంబర్ 6-33, సాయినగర్, అమినాబాద్, యు.కొత్తపల్లి మండలం, కాకినాడ జిల్లా అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు అథారిటీ వారిచే 2016లో జారీ చేయబడిన పాస్‌పోర్టు నెం. **P3737638** గత నెలలో ఫిబ్రవరి 15, 2025న అమినాబాద్‌లో మా ఇంటి నుండి ఉప్పాడ సెంటర్‌కి జిరాక్స్ షాప్‌కి వెళ్తుండగా మా ఇంటి మెయిన్‌రోడ్డు సమీపంలో నా పాస్‌పోర్టు మెయిన్‌రోడ్డు దగ్గర పడిపోయినది. ఎంత వెతికినను దొరకలేదు. కావున పై నెంబర్ గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికినచో ఈక్రింది నెంబర్‌కి తెలియజేయగలరు.

అర్జుల ఏసేబు
సెల్: 9618876962

In the Court of the 1st Additional Junior Civil Judge, Kovvur
O.S. No. 267/2024

శ్రీమతి సనమండ్ర విజయ, వగైరా **-వాదులు**
మరియు
శ్రీమతి పసలపూడి రాణి, వగైరా **-ప్రతివాదులు**

To:
1వ ప్రతివాది/ 1వ రెస్పాండెంట్:
పసలపూడి రాణి, భర్త: రామకృష్ణ, వయస్సు 48, ప్రైవేటు లెక్చరర్, వేళ్ళచింతలగూడెం, గోపాలపురం మండలం, తూర్పుగోదావరి జిల్లా.

పై నెంబరు దావాలో దావా సంగతులు మరియు I.A. No. 684/2024 (టెంపరరీ ఇంజక్షన్ పిటిషన్) సంగతులు తెలియజేయు నిమిత్తం 1వ ప్రతివాది/ 1వ రెస్పాండెంట్‌కు O.S. No. 267/2024 దావా సంగతులు మరియు I.A. No. 684/2024 (టెంపరరీ ఇంజక్షన్ పిటిషన్) నోటీసు సంగతులు తెలియజేయు నిమిత్తం శ్రీ కోర్టు వారి ద్వారాను మరియు రిజిస్టర్ పోస్టు ద్వారాను ఎన్ని పర్యాయమలు దావా సమన్లు మరియు నోటీసులు పంపినప్పటికి సదరు 1వ ప్రతివాది/ 1వ రెస్పాండెంట్ బుద్ధిపూర్వకముగా avoid చేయుచున్న కారణంగా శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ప్రకారం పేపరు ప్రచురణ ద్వారా O.S. No. 267/2024 దావా సంగతులు మరియు I.A. No. 684/2024 నోటీసు సంగతులు తెలియజేయడమైనది. పై నెంబరు దావాలో మరియు పై పిటిషన్స్‌లలో మీకు ఏవైనా అభ్యంతరములు ఉన్న ఎడల **ది. 02-04-2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఏమైనా అక్షేపణలు ఉన్న ఎడల తెలియపర్చుకోవచ్చును. లేని యెడల వారి పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

వాయిదా: 02-04-2025

ఆత్మూరి సత్యనారాయణ
వాది తరపు అడ్వకేటు
కొవ్వూరు, తూ॥గో॥జిల్లా
కొవ్వూరు
ది.17-03-2025
సెల్: 98498 47197